## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్ అనే థీమ్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

మణికొండ, ఏప్రిల్ 21 : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని ధృవంశ్ సంస్థ సభ్యులు వెల్లడించారు. నెక్నాంపూర్, ముష్కిచెరువు, బర్ల కుంటలో ప్లానెట్ వెర్సెస్ ప్లాస్టిక్ అనే థీమ్‌తో ప్రపంచ భూమి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వ్యర్థాలు, బాటిల్స్, కవర్లు మొత్తం 850 కిలోల చెత్తను సేకరించారు. ఈ క్లీనింగ్‌లో కళాశాల విద్యార్థులు, కార్పొరేట్ సంఘాలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొని వ్యర్థాలను తొలగించారు.

### బీఫార్మసీ పరీక్షా ఫలితాల
## రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 21 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ పరీక్షల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బీఫార్మసీ (సీబీసీఎస్), బీఫార్మసీ (నాన్ సీబీసీఎస్), బీఫార్మసీ (పీసీఐ) వన్‌టైం చాన్స్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 25వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 27వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 25వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, రెండో సెమిస్టర్ మేకప్ పరీక్షా ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 2వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

### దేశాన్ని పరిరక్షించాల్సిన
## బాధ్యత కవులు, గాయకులదే

చిక్కడపల్లి, ఏప్రిల్ 21:రాజ్యాంగాన్ని, దేశాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కవులు, గాయకులపై ఉన్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. సెక్యూలర్ రైటర్స్ ఫోరం (సమూహ) ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవి గాయ సమూహ గానం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుప్రసిద్ధ సాహితీవేత్త కె.శివారెడ్డి మాట్లాడుతూ కవులు, కళాకారులు ప్రజాస్వామిక లౌకిక రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం తమ కలం, గళం ఎత్తాలన్నారు. ఈ సమూహం ఇప్పటి పరిస్థితులకు ఎంతో అవసరమని అన్నారు. స్కైబాబా సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కవులు, గాయకులు, సాహితీవేత్తలు పెద్ద ఎత్తున పాల్గొని కవితలు, పాటలను వినిపించారు. సమావేశంలో ప్రము ఖ పాత్రికేయుడు కె.శ్రీనివాస్, పసునూరి రవీందర్, ప్రముఖ కవి యాకుబ్, జయరాజ్, రూపా రుక్మిణి, సుంకిరెడ్డి నారాయణ రెడ్డి, వజ్జల శివకుమార్, మోహన్ కృష్ణ, మెర్సి మార్గరేట్, వద్దరాజు ప్రవీణ్‌కుమార్, పగడాల నాగేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.




### మేకప్ అండ్ కాస్మోటిక్ క్లినిక్‌లపై
## ఆరోగ్యశాఖ అధికారుల దాడులు
### రెండు క్లీనిక్‌లు సీజ్



సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): నగరంలో ఎలాంటి అనుమతి లేకుండా మేకప్, కాస్మోటిక్ పేరుతో క్లినిక్‌లను నిర్వహించడమే కాకుండా.. డీసీఏ అనుమతి లేకుండా సంబంధిత ఔషధాలను విక్రయిస్తున్న క్లినిక్‌లపై రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో రాయదుర్గ ప్రాంతంలోని దీప్తీ పర్మినెంట్ మేకప్ అండ్ కాస్మోటిక్ క్లినిక్, మాదాపూర్‌లోని వీ– స్పార్క్ వెల్నెస్ క్లినిక్‌ను సీజ్ చేశారు. అధికారుల కథనం ప్రకారం.. గ్రేటర్ పరిధిలోని పలుచోట్ల ఎలాంటి అనుమతులు లేకుండానే బ్యూటీ, మేకప్, కాస్మోటిక్ కేర్ పేరుతో క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. దీంతో కొంత మంది రోగులకు వైద్యం వికటించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఈ నెల 20, 21వ తేదీల్లో నగరంలోని రాయదుర్గం ప్రాంతంలో ఉన్న దీప్తీ పర్మినెంట్ మేకప్ అండ్ కాస్మోటిక్ క్లినిక్, మాదాపూర్‌లోని వీ–స్పార్క్ వెల్నెస్ క్లినిక్‌పై దాడులు నిర్వహించారు. అర్హులైన డెర్మటాలజిస్టులు లేకుండానే గుడ్డిగా చర్మ సంరక్షణ, చర్మ సౌందర్య సంబంధిత చికిత్స నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా డీసీఏ అనుమతి లేకుండానే బ్యూటీ ప్రొడక్ట్స్‌కు సంబంధించిన ఔషధాలు, ఇతర ఉత్పత్తులను సైతం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆ రెండు క్లినిక్‌ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసినట్లు రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు.

## కొనసాగుతున్న తనిఖీలు
### రూ.14.63కోట్ల నగదు పట్టివేత

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు గ్రేటర్ వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ. 14.63 కోట్ల నగదును ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. రూ.6,90,90,818 విలువజేసే ఇతర వస్తువులు, 20,920.91 లీటర్ల అక్రమ మద్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. 208 మందిపై కేసులు నమోదు చేసి, 206 మందిని అరెస్టు చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నగదు, ఇతర వస్తువులపై 429 ఫిర్యాదులు రాగా, వాటిని పరిష్కరించారని, 284 మందిపై ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదు చేసినట్లు పేర్కొన్నారు. 2,920 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేసినట్లు రోనాల్డ్‌రాస్ తెలిపారు. తాజాగా.. గడిచిన 24 గంటల వ్యవధిలో రూ.5.88 లక్షల నగదు, రూ ఒక కోటి 62 లక్షల విలువైన వస్తువులను పట్టుకొని, సీజ్ చేసినట్లు వివరించారు.



# స్మార్ట్ పార్కింగ్.. వచ్చేస్తుంది..!

- నిమిషంలో పార్కింగ్.. తిరిగి పొందడానికి 2 నిమిషాలే..
- నాంపల్లిలో తొలి ఆటోమేటెడ్ కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్
- అర ఎకరంలో.. 15 అంతస్తుల్లో.. రూ.80 కోట్లతో.. పీపీపీ విధానంలో నిర్మాణం
- 10 అంతస్తుల్లో వాహనాల పార్కింగ్.. ఐదు అంతస్తుల్లో కమర్షియల్ షాపులు
- రెండు స్క్రీన్‌లతో సినిమా థియేటర్
- 250 కార్లు, 200 ద్విచక్ర వాహనాలు పార్కింగ్‌కు అవకాశం
- నిర్మాణ పనులను పర్యవేక్షించిన మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



సిటీబ్యూరో, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): నగరంలోని నాంపల్లిలో నిర్మిస్తున్న పూర్తి స్థాయి ఆటోమేటెడ్, కంప్యూటరైజ్డ్ మల్టీ లెవల్ కార్ పార్కింగ్ (ఎంఎల్‌పీ) పనులు దాదాపు పూర్తికావచ్చాయని, త్వరలోనే ప్రారంభోత్సవం చేస్తామని హైదరాబాద్ మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం ఆయన మెట్రో అధికారులతో కలిసి పీపీపీ విధానంలో నిర్మిస్తున్న మల్టీ లెవల్ కార్ పార్కింగ్ పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పార్టనర్ షిప్ విధానంలో నిర్మిస్తున్న ఎల్ఎల్‌పీ కోసం సుమారు రూ.80 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మన దేశంలో ప్రప్రథమంగా జర్మనీ పాలిస్ పార్కింగ్ విధానంలో, తక్కువ స్థలంలో ఎక్కువ వాహనాలు పార్కింగ్ చేసేలా ఈ ప్రాజెక్టును చేపట్టామన్నారు.

**నాంపల్లి మెట్రో స్టేషన్‌కు సమీపంలో హెచ్ఎంఆర్‌కు చెందిన అర ఎకరం స్థలంలో 15 అంతస్తుల్లో ఈ కాంప్లెక్సు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఇందులో 10 అంతస్తుల్లో వాహనాల పార్కింగ్ సౌకర్యం, ఐదు అంతస్తుల్లో కమర్షియల్ షాపులు, రెండు స్క్రీన్‌లతో కూడిన సినిమా థియేటర్ ఉంటుందని చెప్పారు. మొత్తం 1,44,440 చదరపు అడుగుల విస్తీర్ణంలో 68శాతం పార్కింగ్, 32 శాతం వాణిజ్య సముదాయాలకు కేటాయిస్తున్నామన్నారు. పార్కింగ్ స్థలంలో 250 కార్లు, 200 ద్విచక్రవాహనాలు నిలిపేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.**

**వాహనదారులకు స్మార్ట్ కార్డు జారీ**

కాంప్లెక్స్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో 4 లోపలకు, బయటకు వెళ్లే టర్మినల్స్ ఉన్నాయి. వాహనాల నిలుపుదల కోసం టర్న్ టేబుల్స్ ఏర్పాటు చేశారు. ఈ టేబుల్‌పై వాహనదారుడు తమ వాహనాన్ని వదిలి తమ నిర్ధేశిత పనులకు వెళ్లిపోవచ్చు. ఎంఎల్‌పీలోనికి వాహనం ప్రవేశించిన సమయంలో వాహనదారులకు స్మార్ట్ కార్డు జారీ అవుతుంది. తరచూ ఎంఎల్‌పీ నియోగించే వారికి ఆర్ఎఫ్ ఐడీ కార్డులు జారీ చేస్తారు. వాహనం యొక్క కొలతల ఆధారంగా కంప్యూటరైజ్డ్ పార్కింగ్ సిస్టమ్ ద్వారా వాహనాల వర్గీకరణ జరుగుతుంది. ఎస్‌యూవీ లేదా సెడాన్ వాహనానికి తగినట్లుగా పార్కింగ్ సదుపాయం కేటాయించబడుతుంది. ఆ తర్వాత ట్రాన్స్‌పోర్టర్ షటిల్ ఆ వాహనాన్ని లిఫ్ట్ ద్వారా నిర్ణీత అంతస్తులో కేటాయించిన స్థలంలో పార్క్ చేస్తుంది. ఈ మేరకు విశాలమైన, సౌకర్యవంతమైన టర్న్ టేబుల్స్ ఏర్పాటు చేశామని ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముంబాయి, ఢిల్లీలో ఉన్న ఎంఎల్‌పీ పార్కింగ్ వ్యవస్థతో వాహనదారులు కొంత ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, ఆ పరిస్థితి ఇక్కడ ఉండదని అన్నారు.

**నెలలోనే ట్రయల్ రన్**


పార్కింగ్ చేసిన వాహనాన్ని తిరిగి పొందడానికి డ్రైవర్ పార్కింగ్ రుసును చెల్లించి, పార్కింగ్ టికెట్‌ను కార్డ్ రీడర్‌కు చూపగానే ట్రాన్స్‌పోర్టర్ షటిల్ ఆటోమేటిక్‌గా కారును వాహనదారుడికి అందజేస్తుంది. పార్కింగ్ కోసం కేవలం ఒక నిమిషం కంటే తక్కువ సమయం, తిరిగి పొందడానికి 2 నిమిషాల సమయం మాత్రమే పడుతుందని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. ఎంఎల్‌పీ డెవలపర్లు అయిన డాక్టర్ హరికిషన్ రెడ్డి, భావనారెడ్డిలకు ఆయన పలు సూచనలు చేశారు. నిర్మాణ పనులను పూర్తి చేసి ఒక నెలలోగా ట్రయల్ రన్ ప్రారంభించాలని కోరారు.



మల్టీ లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణ పనులను పర్యవేక్షించిన హైదరాబాద్ మెట్రో రైలు ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి


### త్వరలోనే అందుబాటులోకి..

పీపీపీ విధానంలో మెస్సర్స్ భారీ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 50 సంవత్సరాల రాయితీ కాలంతో ఈ పార్కింగ్ కాంప్లెక్సు నిర్మాణం చేపట్టిందన్నారు. కొవిడ్ తీవ్రత, డెట్ ఫైనాన్సింగ్ సమస్యలు, గ్లోబల్ సప్లై చైన్ అంతరాయాల వంటి కారణాలతో ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ సమస్యలన్నింటినీ అధిగమించామని, అతి త్వరలోనే ఆధునిక పార్కింగ్ సౌకర్యం నగర ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.



# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్, బీజేపీ నేతలు

కంటోన్మెంట్, ఏప్రిల్ 21 : బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రసూల్‌పురాకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అజేయ శక్తిగా దూసుకెళ్తుందన్నారు. ఎవరెన్ని మాటలు చెప్పినా కంటోన్మెంట్ ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మహ్మద్, దావూద్ ఖాన్, ఆసిఫ్, అక్రమ్, జాఫర్, సిరాజ్, రమేశ్, సలీం తదితరులు పాల్గొన్నారు.



బోయిన్‌పల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి

### ఓలా, ఉబర్‌లకు ప్రభుత్వ అనుమతి లేదు
**వాటిపై చర్యలు తీసుకోవాలి**
**తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ డిమాండ్**

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 ( నమస్తే తెలంగాణ ) : తెలంగాణ రాష్ట్రంలో ఓలా, ఉబర్ సంస్థలకు ప్రభుత్వ అనుమతి లేదని, ఆ సంస్థల కార్యకలాపాలతో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ అన్నారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా ఓలా, ఉబర్‌లు వాహనాలను నడిపిస్తున్నాయని, ఈ సంస్థలపై రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నో ఏసీ ఉద్యమం నిర్వహిస్తున్న తాము అనుమతి లేకుండా నడుస్తున్న యాప్ అగ్రిగేటర్స్‌పై కేసులు నమోదు చేయాలని చెప్పారు. కమీషన్ తక్కువగా ఇచ్చి డ్రైవర్ల జీవితాలతో ఆ సంస్థలు చెలగాటమాడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం స్పందించి వాటిపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వమే యాప్ ఏర్పాటు చేసి అందులో తెలంగాణ డ్రైవర్లందరికి ఉపాధి కల్పించాలని అన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి




జాతీయ జెండా ఊపుతూ నృత్యం చేస్తున్న విద్యార్థులు

పూడూరు, ఏప్రిల్ 21 : చదువుకునే విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చన్గోముల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కడ్మూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటాపాటలు, నృత్యాలు, ఇంద్ర జాలికులు మురళీధర్, అశోక్‌గౌడ్, వర్మల మ్యాజిక్ షోలు అందరినీ ఆకర్శించాయి. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహన్, హెచ్ఎం మధు, స్వరూప, పాఠశాల చైర్మన్ లక్ష్మి, సత్యనారాయణ, అబ్జల్, సురేశ్, మాణిక్యం, ఉపాధ్యాయులు అనూశ, హరీశ్‌బాబు, శ్రీశైలం విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నగరానికి ఎల్లో అలర్ట్
**రాగల మూడు రోజులు వర్షాలు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ) : ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల మూడు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తెలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. దీంతో నగరానికి ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీచేశారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38.8డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.9డిగ్రీలు, గాలిలో తేమ 27శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

## ఆడబిడ్డ పెండ్లికి ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేసిన మాజీ సర్పంచ్ పెంటయ్య

పూడూరు, ఏప్రిల్ 21 : మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో పేద కుటుంబానికి చెందిన వడిత్య లక్ష్మీబాయి రాజూనాయక్‌ల కుమార్తె సరిత వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహానికి హాజరైన తిర్మలాపూర్ మాజీ సర్పంచ్ పెంటయ్య పెండ్లి కుమార్తె తల్లిదండ్రులకు రూ.11వేలు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు పెంటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరమేశ్, గోపాల్, సాయన్న, బాలు తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా దుకాణంలో దొంగతనం

బొంరాస్‌పేట, ఏప్రిల్ 21 : మండల కేంద్రంలోని ఓ కిరాణా దుకాణంలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. భూలక్ష్మీ ఆలయ చౌరస్తాలో అహ్మద్ హుసేన్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి ఎప్పటిలాగే దుకాణం షెట్టర్లు మూసి పై అంతస్తులో నిద్రించారు. ఆదివారం ఉదయం దుకాణం తెరవడానికి కిందికి రాగా మూసిన షెట్టర్లు మూసినట్లే ఉండగా దుకాణం గదికి పక్కన ఉన్న తలుపునకు వేసిన తాళం విరగొట్టి తలుపు తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూడగా డ్రాలో ఉంచిన రూ.33 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై అబ్దుల్ రవూఫ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వేలిముద్రల నిపుణులు వచ్చి ఆధారాలను సేకరించారు. బాధితుడు అహ్మద్ హుసేన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా బొంరాస్‌పేటలో గత నెల రోజులుగా వరుసగా జరుగుతున్న దొంగతనాలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
సిద్దిపేట/గజ్వేల్/తూప్రాన్/మెదక్ : 80966 77663
సంగారెడ్డి/జహీరాబాద్/నారాయణఖేడ్ : 9182777658
పటాన్‌చెరు : 80966 77657